# యేసే జవాబు

# (మార్కు 2:1-12)

నిన్ను గూర్చి నాకు అంతా తెలియదు గాని, ఒక విషయం మాత్రం నిన్ను గూర్చి నాకు తెలుసు. కొన్ని సమస్యలతో నీవు సతమతమౌతున్నావు. అది ఆత్మ సంబంధమైనదే కావచ్చు, ఆర్థిక పరమయ్యిందే కావచ్చు, కుటుంబ సమస్యయే కావచ్చు - లేదా ఏ ఒక కలవరమే కావచ్చు - మొత్తానికి నీవేదో ఒక సమస్యతో సతమతమౌతున్నావ్. మనమందరం ఏదో యొక దానితో సతమతమౌతూనే ఉంటాం. మన సమస్యలు ఎలాంటివైనా సరే, వాటన్నిటికి యేసే జవాబు అనే సత్యాన్ని ఈ పాఠంలో స్థిరపరచ గోరుతున్నాను.

క్రొత్త నిబంధన అంతా ఈ గొప్ప ఉద్దేశాన్ని తెలియజేస్తుంది. అయితే మన ఉద్దేశం కొరకు మార్కు 2:1-12లో కన్పించే, క్రీస్తు జీవితంలోని ఒక చిన్న సంభవం దగ్గరకు వెళ్ళుదాం.

### రోగి - అతని నలుగురు స్నేహితులు (మార్కు 2:1-4)

ఆ లేఖన భాగం యిలా ప్రారంభింపబడుతుంది, "కొన్ని దినములైన పిమ్మట ఆయన కపెర్నహోమునకు వచ్చెను" (1వ.). గలిలయలోని ప్రభువు కార్యక్రమాలకు కపెర్నహోము కేంద్రంగా ఉంది. మార్కు 1:21నుండి వచనాల్లో, ఆయన ఆ స్థలానికి వచ్చినట్టు చదువుతాం. అప్పుడు ఆయన అపవిత్రాత్మ పట్టిన ఒకనిని (1:23-27), పేతురు అత్తను (1:29-31) బాగు చేశారు. ఆ దినం అద్భుతంగా స్వస్థతలు జరిగించడంతో ముగిసింది (1:32-34). ఇప్పుడు ఆయన కపెర్నహోమునకు తిరిగి వచ్చారు.

గలిలయలో సంచరించిన విరామంలేని ప్రయాణంనుండి విశ్రమించడానికి యేసు ఒంటరిగా ఉండగోరినట్టున్నారు (1:35, 45లో గమనించు). అయితే "ఆయన ఇంటి వద్ద" ఉన్నట్టు వినబడింది (2ఎ వ.). "యేసు తిరిగి వచ్చారు!" అని ఒకనినుండి మరొకనికి వార్త అందింపబడింది.

"అనేకులు కూడి వచ్చిరి గనుక వాకిటనైనను వారికి స్థలము లేకపోయెను" (2బి వ.). ఆ దినాల్లో ఆతిథ్యం చేయడం వాడుకగా ఉండేది. పగటివేళ తలుపులు సాధారణంగా తెరిచి ఉంచబడేయ్. జనులు తమకు యిష్టం వచ్చినట్టు వచ్చిపోతూ ఉండేవారు. గనుక తొందరలోనే ప్రభువు ఉన్న యిల్లు జనులతో నిండిపోయింది.

జన సమూహం యింటి ద్వారం వెలుపల క్రిక్కిరిసి ఉన్నారు.

రెండవ వచనం చివరి భాగాన్ని గమనించు. "ఆయన వారికి వాక్యము బోధి" స్తున్నారు. నశించిన దానిని వెదకి రక్షించడానికి ప్రభువు వచ్చారు (లూకా 19:10). అది ఆయన ప్రాథమిక కర్తవ్యం; అది ఆయన కార్యక్రమంలో మొట్టమొదటిది. గనుక ఆ అవకాశాన్ని వాక్యం బోధించడానికి యేసు వినియోగించారు.

నలుగురు స్నేహితుల సంఘటనకు దృశ్యం యిలా ఏర్పాటయ్యింది. కొందరు "పక్షవాయువుగల ఒక మనుష్యుని నలుగురిచేత మోయించుకొని ఆయన యొద్దకు వచ్చిరి" (3 వ.). ఆ దృశ్యాన్ని సరిగా చూద్దాం. ఆ నలుగురికి పక్షవాయువుగల ఒక స్నేహితుడున్నట్టున్నాడు. అతడు పడిపోయి కదలలేక యున్నాడు. ఇది కూడా మన సంఘటననంతటిని చెప్పడంలేదు. పక్షవాయువుతో పాటు నరములు పట్టుకు పోయిన మూర్ఛవంటి స్థితి అతనిని వెంటాడినట్టు అధికారాలంటున్నాయి.

> కండరాల పటుత్వం పోతుంది. భయంకరమైన బాధకు తట్టుకోలేక అతడు పడిపోతే, నిస్సహాయ స్థితిలో వేదనతో తిప్పబడుతూ ఉంటాడట. ఇలాటిది తరచుగా సంభవిస్తు న్నప్పుడు, దీనికి విముక్తి మరణంలోనే కన్పిస్తుంది.

ఆ మనుష్యుడు అలాటి దుర్భరమైన స్థితిలో నిలిచియున్నాడు.

ఇంతకమునుపు ప్రభువు కపెర్నహోములో ఉన్నప్పుడు అతడు ఆయన యొద్దకు ఎందుకు తేబడలేదో తెలియదు. అయితే తడవు చేయకుండ యిప్పుడు ఆ నలుగురు మనుష్యులు అతనిని యేసు నొద్దకు మోసికొని వచ్చారు.

వాస్తవంగా వారి స్నేహితుని సమస్యకు యేసే జవాబని ఆ నలుగురు గుర్తించి నట్టున్నారు. 5వ వచనం వారి విశ్వాసాన్ని గూర్చి ప్రస్తావించింది. యేసునందు వారుంచిన విశ్వాసమెట్టిదో?

### సహాయపడు యేసు యొక్క శక్తిలో (వారి విశ్వాసం)

మొదట, సహాయం చేయగల శక్తి యేసునందున్నట్టు ఆ నలుగురు స్నేహితులు గుర్తించారు. పోయినసారి ప్రభువు కపెర్నహోములో నున్నప్పుడు ఆయన శక్తి ప్రదర్శింపబడింది. తాను అప్పుడే ముగించిన గలిలయ ప్రయాణంలోఆయన శక్తి రుజువు చేయబడింది.

మనం దీనిని గుర్తించడం చాలా ప్రాముఖ్యం. మనకందరికి సమస్యలున్నాయి. మన సమస్యలు ప్రత్యేకమైనవి లేక వేరైనవని మనం కొన్ని సార్లు నమ్ముతాం. అలాటివి యింతకమునుపు ఎవరికి లేవని భావిస్తాం. మన సమస్యలకు పరిష్కారం లేదని, వాటిలో మనకు సహాయపడే వారెవ్వరూ లేరని కూడా ఆలోచిస్తాం. అయితే దేవునికి అసాధ్యమయ్యింది ఏదీ లేదని గుర్తించడం అవసరం (ప్రాముఖ్యం) (లూకా 1:37).

**సహాయపడు యేసు కోరికలో (వారి విశ్వాసం)**

(మనం అనుకున్నదానికంటె) వారి విశ్వాసం మించి ఆవరించింది. యేసు ఆ శక్తిని వినియోగించ నిష్టపడినవాడని వారు విశ్వసించారు. అలా నమ్మడానికి వారికి అనేక కారణాలున్నాయి. క్రీస్తు యొక్క జాలి (గల మనస్సు) కపెర్నహోమును ఆయన ముందు సందర్శించినప్పుడు ప్రదర్శించ బడింది. ఈ మధ్య జరిగిన గలిలయ ప్రయాణంలో అది ఉదాహరణలతో సూచింపబడింది.

ఆ ప్రయాణంలో కుష్ఠరోగిని శుద్ధునిగా ఆయన చేసిన సంగతి వివరంగా చెప్పబడింది. ''ఒక కుష్ఠరోగి ఆయన యొద్దకు వచ్చి ఆయన యెదుట మోకాళ్లూని - నీకిష్టమైతే నన్ను శుద్ధునిగా చేయగలవని ఆయనతో చెప్పి ఆయనను వేడుకొనగా'' (మార్కు 1:40). దానికి, ''క్రియలేని పద సముదాయంలో'' ప్రభువు యిచ్చిన జవాబును గుర్తించకుండ పోవడం సులభసాధ్యం. అయితే ''ఆయన కనికరపడి, చెయ్యిచాపి వానిని ముట్టి - నాకిష్టమే; నీవు శుద్ధుడవు కమ్మని వానితో చెప్పెను'' (41వచనం).

కొన్ని సంవత్సరాల క్రిందట బెల్ అనే టెలిఫోన్ కంపెనీ - ''దగ్గరకు వెళ్ళి (ఎవనినో) ఒకనిని తాకు'' అనే పేరుతో తన ప్రచార కార్యక్రమం జరిపింది. ఆ ప్రచారంలో ''ఎవరో ఒకరిని'' అంటేనట - కుటుంబాన్ని, స్నేహితుని, ప్రియుని అనే భావననేగాని, కురూపినో, కునిష్టుడనో, మురికివానినో, రోగినో అనేది కాదట. కాని యేసైతే తన చెయ్యి చాపి కుష్ఠరోగిని ముట్టాడు.

ఆ రోజుల్లో ''కుష్ఠు'' అనేది అంటు జాడ్యంగా భావింపబడేది. సమాజంలో నుండి కుష్ఠరోగులు తమ్మును తామే వేరు చేసికొంటూ వుండేవారు. కుష్ఠరోగిని ఎవరూ ముట్టకూడదనే భావన ఉండేది. అయితే ''యేసు తన చెయ్యి చాచి ఆ కుష్ఠరోగిని ముట్టారు.''

యేసు అతన్ని ఎందుకు ముట్టారు? వానిని శుద్ధి చేసే పనిలో వానిని ముట్టడం అవసరమా? (అలా అవసరమనే) దాన్ని నేను సందేహిస్తాను. అయినా యేసు అతన్ని ముట్టడంలో ఏదో ఒక కారణముంటుందని నేను ఒప్పింపబడుతున్నాను. ''ఆయన కనికరపడి, తన చెయ్యిచాచి వానిని ముట్టా'' రు.

అది ఎలాగున్నా, ప్రభువు లక్ష్యపెట్టేవారని ఆ నలుగురు స్నేహితులు ఒప్పింప బడకుంటే, వారు జరిగించిన పనిని జరిగించి యుండేవారే కాదు. యేసు జవాబు మాత్రమే కాదు. ఆయన మనకొరకు చింతించువాడుకూడా. మనకు ఆయన సహాయపడ నుద్దేశంగలవాడైయున్నాడు. ఈ (సత్యాన్ని) మనం గుర్తించాలి.

ఆ మనుష్యులు తమ స్నేహితుని యేసు నొద్దకు మోసికొని వచ్చినప్పుడు, వారొక అడ్డంకును ఎదుర్కొన్నారు. జన సమూహం అడ్డంగా నిలిచియున్నందున వారు అతనిని ఆయన యొద్దకు తేలేకపోయారు. ఆ యిల్లు జనంతో నిండియున్నట్లు

(మరచి పోకు) గుర్తుంచుకో. ద్వారం వెలుపలి వరకు జనులు గుమికూడియున్నారు (2 వచనం).

"ఆ నలుగురిలో నేనొకడనైయున్నట్టయితే, మనం చాల ప్రయత్నించాం; యింటికి తిరిగి తీసికొని వెళ్ళుదాం పదండి" అని అనేవాడనే. లేదా, జనాలు తగ్గే వరకు మన స్నేహితుని ఒక చెట్టు క్రింద ఉంచుదాం - అని అనియుండేవాడనే. అయితే ఆ నలుగురు మనుష్యులు వీటిలో ఏ పనికి పూనుకోలేదు. తమ స్నేహితుని పరిస్థితికి యేసే జవాబని, అతనికి వేరే గత్యంతరమేమీ లేదని వారు మూడు పనులు చేశారు.

(1) *వారు కష్టమైన దాన్ని జరిగించారు:* తమ స్నేహితుని ఆ యింటి కప్పు మీదికి తెచ్చారు. నేను పసివాడనైయున్నప్పుడు - నేడు మనం బైబిలు క్లాసుల్లో ఉపయోగించేలాంటి కార్డుమీద ఒక బొమ్మను చూచాను. వెలుపటి భాగంలో యింటి పైకి ఎక్కే మెట్లు ఆ బొమ్మలో ఉన్నాయి. ఒకవేళ ఆ యింటికి అలాటి మెట్లున్నా యేమో, ఒకవేళ అలాటి మెట్లున్నా, వాటి మీదుగా పక్షవాయువుచేత పడియున్నవానిని యింటిమీదికి మోసికొని పోవడం కష్టమే. అయినా అలాటి మెట్లు ఆ యింటికి ఉన్నట్టు నమ్మడానికి ఏ ఆధారం లేదు. ఆ ప్రాంతాల్లో యిండ్లు ఒకదాని ప్రక్కన ఒకటి కట్టబడుతూ వుంటాయి. ఒకవేళ ప్రక్క యింటికి బయట మెట్లున్నా వాటిని ఉపయోగించుకోడానికి వీలుండదు. ఒకవేళ వారు నిచ్చెన నుపయోగించారేమో. ఏ బాధలు పడ్డా, వారు తమ స్నేహితుని ఆ యింటి పైకప్పు మీదికి మోసికొని పోయారు. అంటే, కష్టతరమైన కార్యాన్ని వారు జరిగించారు.

(2) *ఎదురు చూడని దాన్ని వారు చేశారు:* "వారు యింటి పై కప్పును విప్పారు" (4బి వచనం). అక్షరార్థంగా, వారు ఆ యింటి పై కప్పును లేకుండా చేశారు. సాధారణంగా ఆ ప్రాంతాల్లో గోడనుండి గోడకు కొయ్యలు వేశేవారు. వాటిమీద చెట్ల కొమ్మలు, కుచ్చు వేశేవారు. వాటి మీద చెత్తపరచి మట్టితో అలికేవారు. ఈలాటి యింటి కప్పును ఆ నలుగురు విప్పసాగారు.

(3) *వారు ఖరీదయ్యే పని చేశారు:* కొంతసేపు నీవే ఆ యింటి యజమానుడనుకో. ప్రభువు బోధను శ్రద్ధగా వింటున్నావ్. అకస్మాత్తుగా నీ యింటి పైకప్పు మీదనుండి శబ్దం వినబడింది. దుమ్ము, ధూళి, తరువాత చెత్త మట్టి పెళ్లలు పడసాగాయ్. పైకి చూచావ్. నీ యింటి పైకప్పు నెమ్మదిగా తొలిగించబడుతుంది. అప్పుడు నీవేమనుకుంటావ్? ఈ కప్పును మరలా ఎవరు కప్పుతారు అని అనుకుంటావా? దానికి సమాధానం ఆ నలుగురు మనుష్యులే. ఆ యింటిని తిరిగి వారే కప్పుతారో లేదా, దానికయ్యే ఖర్చు భరించి వారే కప్పిస్తారో. గనుక వారు చేసిన పని ఖర్చుతోకూడింది. తమ స్నేహితుని యేసు నొద్దకు తేడానికిగాను వారు దాన్ని కూడ లక్ష్య పెట్టలేదు.

పిల్లల తరగతుల్లో ఈ కథ సాధారణంగా స్నేహ బంధానికి వర్తింపజేయ

బడుతుంది. అయితే ఆ నలుగురు ఎంతటి అద్భుతమైన స్నేహితులో! వారు మన కెంత మాదిరిగా నున్నారో! ప్రభువు కావలసిన జనులెవరో మన కందరికి తెలుసు. వారు తమ్ముకను తాము బాధ పరచుకునేవారే కావచ్చు, లేదా రక్షణ వారికి అవసరమైనా ఆ సంగతి వారు గుర్తించనివారైనా కావచ్చు. అలాటి వారిని క్రీస్తు నొద్దకు నడిపించడానికి మనమెంత ప్రయాసపడుతున్నాం? ఒకసారి వారిని ఆహ్వానించిన తరువాత వారు ''రాము'' అంటే - ''ప్రయత్నించాం. ఇక ప్రయత్నించబోయేదిలేదు'' అని అనుకుంటామా? లేక జనసమూహం తగ్గేవరకు వేచి యుందాం. అనుకూలమైనప్పుడే చూద్దాం అనే అవకాశం కూడా వుంది.

అలాటి దాన్ని మనం ఎదుర్కొందాం. ప్రజలను ప్రభువు నొద్దకు నడిపించడం బహు కష్టతరమౌతాదనేది వాస్తవం. జన సమూహాలు మార్గంలో అడ్డుగా నిలిచియున్నారు. ఆ నలుగురు స్నేహితుల విరామంలేని కార్యక్రమంలా మన విరామం లేని కార్యక్రమాలు - వారి కున్న అడ్డంకుల వంటివే మనకు కూడా మార్గంలో ఉన్నాయి. అయినా మనం ప్రేమించే వారి సమస్యలకు యేసే జవాబు అని హృదయ పూర్వకంగా ఒప్పింపబడిన వారమైతే వారిని ప్రభువునొద్దకు తెచ్చేవరకు మనం విశ్రమింపం! పక్షవాయువుగలవాని స్నేహితులవలె - కష్టతరమైన దాన్ని, ఎదురు చూడని దాన్ని, ఖరీదైన దాన్ని మనం చేస్తాం.

## యేసు - రోగియైన మనుష్యుడు (మార్కు 2:5-12)

యేసు, రోగియైన మనుష్యుడనే సంభవంలోని చివరి భాగానికి మళ్ళి, యేసు ప్రతి సమస్యకు ఎలా పరిష్కారమైయున్నాడో చూద్దాం. మన దృష్టి ఆ నలుగురు మనుష్యుల యొద్దనుండి యేసు వైపుకు మరల్చుదాం.

> "... ఆయన కూర్చున్న చోటికి పైగా ఇంటి కప్పు విప్పి సందుచేసి పక్షవాయువు గలవానిని పరుపుతోనే దింపిరి. యేసు వారి విశ్వాసము చూచి - కుమారుడా, నీ పాపములు క్షమింపబడియున్నవని పక్షవాయువు గలవానితో చెప్పెను" (4-5 వచనాలు).

ఇంటిలో గుమికూడియున్నవారి ముందు యేసు నిలిచి యున్నాడనుకో, ఆయన అక్కరగలవాడై దేవుని గూర్చిన సంగతులు మనః పూర్వకంగా మాట్లాడుతున్నారు. దుమ్ము, ధూళి, క్రిందికి రాలుతున్న మట్టి వగైరాలు ఆయన చుట్టూ అకస్మాత్తుగా పడనారంభించాయి. ఆయన పైకి తేరిచూడగా, ఇంటికప్పు శిథిలమైపోయి సందుకన్పిస్తుంది. వెంటనే నాలుగు ముఖాలు ఆయనవైపు తొంగి చూస్తూ, ఎనిమిది చేతులు ఆ రంధ్రాన్ని చేస్తున్నట్టు కన్పించాయి. కడకు ఆ సందు పెద్దదిగా చేయ బడింది. జాగ్రత్తగా, అత్యంత జాగ్రత్తగా ఆ నలుగురు తమ స్నేహితుని యేసు ఎదుటికి దించారు. అప్పుడు ప్రభువుయొక్క ప్రతిచర్య ఏమైయుంది? ఆ సందర్భంలో నీ ప్రతిచర్య లేక నాది ఎలా ఉండేది?

ఆదివారం ఉదయం స్థానికంగా సంఘమంతా కూడి ఆరాధించే సమయంలో సువార్తికుడు బహు చక్కగా బోధించే దేవుని వాక్యాన్ని వినడంలో నిమగ్నులైయున్నా రనుకో. ఎదురు చూడకుండ ఇంటి కప్పుపైన మనుష్యులు నడుస్తున్నట్టు వినిపించింది. దానిపై రంధ్రం చేయబూనినవారు కప్పును బ్రద్దలు కొడుతున్నారు. విధ్యుత్ రంపాల శబ్దపు గర్జనలు బయలుదేరాయి. స్లాబ్‌గుండా పొడుచుకొంటూ వచ్చినట్టు రంధ్రం చేయబడింది. నేలమీద పడేలా సీలింగ్ కూలిపోయింది. జనులు చూస్తూ ఉండగా చాపమీద పరుండ బెట్టబడిన యొక మనుష్యుడు నలుమూలల త్రాళ్ళతో బోధన వేదిక ఎదుటికి దింపబడ్డాడనుకో, అప్పుడు అక్కడ కూడియున్న వారి ప్రతిచర్య ఎలాగుంటుందో? అరే! మీరు ముఖద్వారాన్ని ఎందుకు వాడుకోలేదు? అని అడగవచ్చు. మొదటిగా అందరు కోపంతో మండిపడి యుండవచ్చు. బిల్డింగు పగల గొట్టడానికి మీకు ఎంత ధైర్యమని అడిగియుండవచ్చు. ప్రాముఖ్యమైన కార్యక్రమాలు యిక్కడ జరుగుతున్నట్టు మీకు తెలియదా? అని ప్రశ్నించి యుండవచ్చు.

(ఈ సంగతి ఎలాగున్నా), నా ప్రసంగానికి ఎంతటి అంతరాయం కలిగించారు? అది చాలదన్నట్టు నాకు ఆతిథ్యం చేసే వ్యక్తి ఎంతో దయగా తన యింటిని కూడుకొనే స్థలంగా ఉపయోగించుకొనడానికి యిస్తే, మీరు దాన్ని దుర్వినియోగం చేశారంటూ యేసు వారికి ప్రతిచర్య చేసియుండేవాడే. అయినా, ఆ రూపంలో ఆయన తన ప్రతిచర్యను కనుపరచలేదు. అంతరాయం అడ్డగించగల ప్రభువు మనకున్నాడని గుర్తించడం ఆశ్చర్యకరం కదా! ఆయన ప్రాముఖ్యమైన అనేక పనులలో విరామం లేకుండ వున్నారు. ''మహత్తుగల మాటచేత'' ఆయన సర్వాన్ని నిర్వహిస్తున్నారు (హెబ్రీ. 1:3). అయినా, దోషములతో, బలహీనతలతో ఆయన యొద్దకు వచ్చినప్పుడు, మన మనవులు ఆలకించడానికి ఆయన సమయం తీసికొంటాడు.

యేసు తన ప్రతిచర్యను ఎలా కనుపరచారు? తన కాళ్ళ యొద్ద ఉన్న మనిషిని చూచి ఆయన తన కన్నులు దించాడు. అతని శరీర వ్యాధిని మాత్రమేకాదు వాని హృదయపు నిస్సహాయ స్థితిని కూడా ఆయన చూచారు. గత(జీవితం)లోని వాని పాపదోషం వాని ఆత్మను తిని వేస్తున్నట్టుంది. గనుక యేసు ఆ పక్షవాయువుగల మనుష్యుని చూచి, ''కుమారుడా, నీ పాపములు క్షమింపబడియున్నవని'' చెప్పారు. ఆది భాషలో, ''చిన్నవాడా'' అని అప్యాయతగా వాడబడిన పదం, ''కుమారుడా'' అని తర్జుమా చేయబడింది. ''క్షమింపబడ్డాయి'' అనే దాని ప్రాధాన్యతను కనుపరచడానికి ఆ పదమే ముందుగా ప్రయోగించబడింది. ఆ వాక్యం అక్షరార్థంగా - చిన్నవాడా, ''క్షమింపబడినవి నీ పాపములు'' అని వ్రాయబడియుంది.

పక్షవాయువు అనే భౌతిక సమస్య ఆత్మ సంబంధమైన సమస్యకు ప్రతిఫలంగా వచ్చినట్టు ఈ వచనం బోధించడంలేదు. యోహాను 9లో శరీర సంబంధమైన సమస్యకు

ఆత్మసంబంధమైన సమస్యయే ఎల్లప్పుడు కారణమైయుండదని యేసు నొక్కి చెప్పారు (2వ వచనం నుండి). ప్రభువు కనుపరచే తొలి అక్కర మానవ శరీర సంబంధమైన సమస్యకాదు; వాని ఆత్మ సంబంధమైన సమస్యయేనని ఈ వచనం బోధిస్తుంది. గనుక అతి ప్రాముఖ్యమైన సమస్యను ఆయన ముందుగా సరి చేస్తున్నాడు.

### పాపపు సమస్యకు జవాబు

ప్రతి సమస్యకు యేసే జవాబని మనమన్నప్పుడు, పాపపు సమస్యకు ఆయన ప్రప్రథమమైన జవాబని మనం గ్రహించాలి. ప్రభువు ఈ లోకానికి వచ్చింది ప్రధానంగా నలిగిన దేహాలను బాగుచేయడానికిగాని, లేదా ఈ జీవితానికి సంబంధించిన క్రొత్త మనస్ తత్వ శాస్త్రంతోనో, తత్వశాస్త్రంతోనో మానవ సమస్యలను కుదర్చడానికి గాని రాలేదు. ఆ పని చేయడానికైతే ఒక గొప్ప బోధకుని దేవుడు పంపి యుండేవాడే. పరలోకంనుండి దాని యొక్క ప్రకాశమానమైన భూషణ (కిరీటాన్నే) దోయవలసిన అవసరం ఆయనకుండేది కాదు. సిలువలో మరణించేలా ఆయన తన కుమారుని పంపియుండనవసరత ఉండేది కాదు.

యేసు పాపపు సమస్యకు పరిష్కారంగా వచ్చారు; ఆయన మాత్రమే దాన్ని సాధించగలరు. ''నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్యకుమారుడు'' వచ్చినట్టు ఆయన నొక్కి చెప్పారు (లూకా 19:10).

ఈ సమయమందు నీ అంతరంగంలో నీవు గాయపడుతూ ఉండవచ్చు. నీవు బాధచేత నింపబడియుండవచ్చు. నీ శరీరం, మనస్సూ ఆ బాధనుండి విముక్తి కొరకు విలపించుతూ ఉండవచ్చు. ఆ విముక్తి నీవు కనుగొనాలంటే, ''ఆత్మసంబంధమైన నా పరిస్థితి ఎలాగుంది? దేవునితో నా బాంధవ్యం ఎలాగుంది?'' అని నిన్ను నీవే అడుక్కోవాలి.

మొదటి ప్రాధాన్యతలు తలక్రిందులుగా తిప్పబడిన లోకంలో నేడు మనమున్నాం. ఉదాహరణకు, ''పరిసరం, వాతావరణం'' అనే వాటిని గూర్చి మనం ఎక్కువగా వింటున్నాం. ఈ లోకాన్ని శుభ్రంగా ఉంచవలసిన అవసరతను నేనంగీకరిస్తాను. దేవుడు భూమిని నరుల వశము చేసి, దాని విషయంలో మంచి గృహనిర్వాహకులుగా ఉండేలా ఆయన వారిని నియమించాడు (ఆది. 1:28; 2:15). అయినా ''మానవాళికున్న నివాసమంతా యిదే''నని అంటున్న జనుల వెర్రి మాటలను నేను విన్నా! వారిని గూర్చి నాకు తెలియదుగాని, నాకు మాత్రం శ్రేష్ఠమైన నివాసముంది (యోహాను 14:1-3)! టి.వి, సినిమా, తమాషా సంగీత తారలు, యింకా యితర ప్రముఖులు - ''గాలి కాలుష్యం, నీటి కాలుష్యం''లను గూర్చి మాట్లాడగా విన్నాను. అయితే మీరు అదే సమయంలో యువ్వనస్థుల మనస్సులను కాలుష్యం చేస్తున్నారే! ఈ గ్రహం కాలుష్యమవ్వడానికి మనలో ఎవ్వరూ దోహదం కాకుండాలని నిరీక్షి

స్తున్నాను. అయితే ఇది నిత్య నివాసంగా ఉద్దేశింపబడలేదు (2 పేతురు 3:10-13). అమరత్వంగల ఆత్మ యొక్క నాశనమే అన్నిటికంటే ఎక్కువైన దుష్ఫలితాలను కలిగియుంది.

లేఖనాల్లో ఏదైనా తేటగా బోధింపబడియుంటే - భౌతికమైన దానికంటె ఆత్మ సంబంధమైనదే అతి ప్రాముఖ్యమైనదనే భావనే! మార్కు 2లో, మానవ దేహ సంబంధమైన సమస్యకంటె, (ప్రధానంగా) ఆత్మ సంబంధమైన సమస్యను గూర్చే మాట్లాడబడింది. నీ సమస్య ఎట్టిదైనా, నీవు బాధింపబడుతూ ఉంటే మాత్రం మొదటిగా ప్రభువుచే నీ ఆత్మసంబంధమైన సమస్యను పరిష్కరించనివ్వు.

## జీవితంలో ఎలాటి సమస్యకైనా సమాధానం (ఆయనే)

మానవ ఆత్మసంబంధమైన సమస్యను పరిష్కరించిన తరవాత, వాని రెండవదైన సమస్యను పరిష్కరించడానికి ప్రభువు ముందుకు సాగుతున్నారు. ఆయన్ను విమర్శించే వారు అక్కడే ఉన్నట్టు తరువాత వచనం గుర్తిస్తుంది. ''శాస్త్రులలో కొందరు అక్కడ కూర్చుండి,'' తమ హృదయాల్లో ఆలోచించుకొంటూ ఉన్నారు (6 వ.). ''శాస్త్రు'' లంటే (మోషే ధర్మశాస్త్రానికి) ప్రతులు వ్రాశేవారని అర్థం. గనుక వారు ధర్మశాస్త్ర ప్రవీణులుగా ఎంచబడతారు. ఆచార పరమైన దాన్ని కాపాడే వారుగా యేసును తనిఖీ చేయడానికి అక్కడ చేరినట్టున్నారు. ప్రతి ఒక్కరు వారికి అణిగి మణిగి యుంటారనేది నిస్సందేహం. అందువలన మొదటి వరుసలో కూర్చుండి యుంటారు.

''ఇతడు ఇట్లెందుకు చెప్పుచున్నాడు? దేవదూషణ చేయుచున్నాడు గదా; దేవుడొక్కడే తప్ప పాపమును క్షమింపగలవాడెవడని'' వారు తమ హృదయాల్లో ఆలోచించు కొంటున్నారు (7వ.). వారు కొంతవరకు రైటే! యేసు ఒక సత్పురుషుడే అయితే ఆయన దేవుడు కాడని ఈ దినాల్లో కొందరంటున్నారు. అయినా, యేసు దేవుడు కానట్లయితే, దేవదూషణ చేస్తున్నాడు గనుక ఆయన మరణమునకు పాత్రుడే. శాస్త్రుల ఆలోచనలో ఆ తరువాత వేసే తార్కికపు అడుగు - ''యేసు దేవుడైయుండ సాధ్యమా?'' అనేదైయుండాలి. అయితే వారి దురభిప్రాయం వారిని అలాటి అడుగు వేయడానికి వెళ్లనీయలేదు.

''వారు తమలో తాము ఈలాగున ఆలోచించుకొనుట యేసు వెంటనే తన ఆత్మలో తెలిసికొని - మీరీలాటి సంగతులు మీ హృదయములలో ఎందుకు ఆలోచించుకొనుచున్నారు. ఈ పక్షవాయువు గలవానితో - నీ పాపములు క్షమింపబడి నవని చెప్పుట సులభమా? నీవు లేచి నీ పరుపెత్తికొని నడువు మనుట సులభమా?'' (8-9 వచనాలు). నీ పాపములు క్షమింపబడినవని చెప్పడం సులభమే. ప్రగల్భాలాడే వాడెవడైనా అలా చెప్పవచ్చు.

''అయితే పాపములు క్షమించుటకు భూమిమీద మనుష్యకుమారునికి

అధికారము కలదని మీరు తెలిసికొనవలెనని వారితో చెప్పెను'' (10 వ.). మెస్సీయాను సూచించడానికి దానియేలు మనుష్యకుమారుడనే పదాన్ని ప్రయోగించాడు. (మనుష్య కుమారుడుగా) యేసు తన సాటిలేని తనాన్ని వెల్లడిపరచారు. భూమి మీద ఆయన కొక్కనికి మాత్రమే పాపాలు క్షమించే అధికారముంది. బయలుపరచబడిన లేఖనాల్లో - తనకున్న హక్కును ఆయన మూడు సార్లే వినియోగించుకొన్నట్టు కన్పిస్తుంది. తన అధికారాన్ని చెలామణి చేయడానికిగాను, ఆ పక్షవాయువుగలవానితో, ''నీవు లేచి నీ పరుపెత్తికొని ఇంటికి వెళ్ళుమని'' ఆయన చెప్పారు (11 వ.).

పాపపు దోషారోపణ అనే మానవ ప్రాథమిక సమస్యను యేసు తీర్చగలడని రుజువుపరచుకొనడానికిగాను, వాని రోగమనే రెండవ రకపు సమస్యను పోగొట్టడానికి ఆయన పూనుకొన్నాడు. రోమీయులకు వ్రాసిన పత్రికలో పౌలు తన వాదాన్ని తిరగ తిప్పాడేతప్ప (వాస్తవానికి) యిదే రకమైన భావాన్ని అతడు అక్కడ ప్రయోగించాడు. (దేవుడు) ''తన సొంత కుమారుని అనుగ్రహించుటకు వెనుకతీయక మన అందరి కొరకు ఆయనను అప్పగించినవాడు ఆయనతో పాటు సమస్తమును మనకెందుకు అనుగ్రహింపడు?'' (రోమా 8:32). మరో విధంగా చెప్పాలంటే, ప్రభువు పాపమనే మన ప్రాథమిక సమస్యను సరిచేసినప్పుడు, మనకుండే రెండవ రకమైన సమస్యను కూడా ఆయన తీర్చగలడన్న మాటే.

లేచి, నీ పరుపెత్తికొని యింటికి వెళ్ళుమని ప్రభువు వానితో చెప్పిన తరువాత (కూడియున్న జన సమూహం మధ్య) ఎలాటి నిర్ఘాంతపు స్థితి నిలిచియుండిందో ఊహించలేము. ప్రతివాని దృష్టి ఆ పక్షవాయువుతో నుండినవాని మీద నిలిచి యుండింది (ప్రభువు అతనికి ఆదేశించిన తరువాత కూడా) ఒకవేళ ఆ మనుష్యుడు తన పరుపుమీదనే పండుకొని యుండినట్లయ్యుంటే, ''మెస్సీయా వచ్చాడని మేమనుకున్నాం. కాని, మరోసారి మేము తప్పుచేశాం'' - అంటూ నిట్టూర్పుతో, నిరాశతో ప్రతి ఒక్కడు తన యింటికి వెళ్ళి యుండేవాడే. (దానికి భిన్నంగా) ఆ మనుష్యుడు లేచి తన పరుపును చుట్టి - చంకబెట్టుకొని, వెలుపలికి ద్వారం గుండా నడచి పోతుంటేనో! ఆహా, ఎలాటి అవకాశాలు తెరువబడ్డాయి! జీవితపు సమస్యకైనా తానే జవాబైయున్నట్టు యేసు తన్నుతాను రుజువు చేసికొన్నారు.

''తక్షణమే వాడు లేచి, పరుపెత్తికొని, వారందరి యెదుట నడచి పోయెను'' (12a వ.) (నేడు అద్భుతములని అబద్ధంగా చెప్పబడే లాటివి గాక), క్రొత్తనిబంధన అద్భుతములన్నిటి వలెనే యిది - ఆలస్యంలేనిది, సంపూర్ణమైనది, ఒప్పించునదై యుంది. ఆ సంభవాన్ని చూచిన జనులయొక్క ప్రతిచర్య ఎలాటిదో తెలుపడానికి గాను సువార్త లేఖికులు తమ పదజాలాన్ని పూర్తిగా ప్రయోగించినట్టున్నారు. ''వారందరు విభ్రాంతినొంది మన మీలాటి కార్యములను ఎన్నడును చూడలేదని చెప్పుకొనుచు దేవుని మహిమపరచిరి'' అని మార్కు సూచించాడు (12b వ.).

"జనులు అది చూచి భయపడి, మనుష్యునికిట్టి అధికారమిచ్చిన దేవుని మహిమ పరచిరి" అని మత్తయి అన్నాడు (మత్తయి 9:8). "అందరును విస్మయమొంది - నేడు గొప్ప వింతలు చూచితిమని దేవుని మహిమపరచుచు భయముతో నిండుకొనిరి" అని లూకా వివరించాడు (లూకా 5:26). అప్పుడు - ఇప్పుడు - ఎలాటి జీవిత సమస్యకైనా తానే జవాబైయున్నట్లు ప్రభువైన యేసు కనుపరచుకొన్నారు!

## ముగింపు

ఈ సమయంలో నీ వెట్టి సమస్యలతో సతమతమౌతున్నా, ప్రభువైన యేసు నీకు సహాయం చేయగలరు. కొన్ని సంఘటనల్లో పక్షవాయువుగలవానికి చేసినట్టు ఆయన నీ సమస్యను తీర్చగలడు (తీసివేయవచ్చు). ఆ సందర్భంలో చేసినట్టు ఆయన నేడు అద్భుతం జరిగించడనుకో. ఆనాటివలె నేడు చేయడు. దైవానుకూలంగా నేడు ఆయన ఈ లోకంలో పనిచేస్తున్నాడు. కొన్ని పరిస్థితుల్లో, భారాన్ని భరించుతూ వుంటే, దానియందు విజయం పొందేలా ఆయన చేస్తారు.

ప్రభువునొద్ద నీవు సహాయం కోరతలచితే, మొదటిగా నీవు చేయవలసిన దేమంటే, ఆయనతో నీకున్న సంబంధం ఎలాటిదో చూచుకో. ఆత్మ సంబంధమైన నీ ఆరోగ్యమందు ఆయన మిక్కిలి అక్కరగలవాడై యున్నారు. నీవు క్రైస్తవుడవు కాకపోతే, నీ పాపముల విషయమై మారుమనస్సు పొందు, ప్రభువైన యేసునందు నీ విశ్వాసాన్ని ఒప్పుకో, పాపక్షమాపణ కొరకు నీటిలో ముంచబడు (మార్కు 16:16; అపొ. 2:38). నీవు దేవుని నమ్మకస్తుడవుగా ఉండని కుమారుడవైతే, ప్రభువు నొద్దకు, ఆయన సంఘమునకు ప్రార్థన, పశ్చాత్తాపములతో తిరిగిరా (అపొ. 8:22; యాకోబు 5:16).

దేవునితో నీ సంబంధం సరిగానున్నప్పుడే గతంలో ఎన్నడు ఎరుగని భాగ్యం నీకు లభిస్తుంది. (క్రీస్తునందు) నీ మీద అక్కరగల ఒకరిని నీవు కలిగియుంటావ్. గతంలో నీకెన్నడులేని బలాన్ని నీవు కలిగియుంటావ్. నీ సమస్యలను ఎదుర్కోడానికి అవసరమైన జ్ఞానాన్ని దేవుడు నీకు వాగ్దానం చేశారు (యాకోబు 1:5). నీకు బలమిచ్చే, సహాయపడే సంఘమనే ఆత్మసంబంధమైన కుటుంబంలో నీవుంటావ్.

(ఎలాటి సమస్యకైనా) యేసే జవాబు, ఆయన మాత్రమే జవాబని గుర్తుంచుకో (యోహాను 14:6). నీవు ప్రభువును నిరాకరించినట్లయితే - చీకటి, గందరగోళం అనేవే తప్ప, ఆత్మను సంతుష్టి పరచే నిర్దిష్టములైన జవాబు లేవీలేవు సుమీ! గనుక నీ విప్పుడే ప్రభువు నొద్దకురా - యేసే జవాబు.